రాయబారి

"ప్రకాశం?" అని మెల్లిగా కేక. తరువాత సంకోచిస్తూ చేసిన తలుపు చప్పుడు.

భోంచేస్తూ మాణిక్యంతో సరసాలాడుతున్న ప్రకాశానికి గాని, భోజనం పెడుతూ ప్రకాశంతో సరసాలాడుతున్న మాణిక్యానికి గాని ఆ కేకా తలుపు చప్పుడూ వినిపించలేదు.

ఒక్క పావు నిమిషం ఉండి మళ్ళీ, "ప్రకాశం" ఈసారి కాస్త గట్టిగా, కాస్త గట్టిగానే తలుపు చప్పుడు కూడా.

"ఉండు! ఉండు! ఎవరో తలుపు తట్టుతున్నట్టున్నారు" అన్నాడు ప్రకాశం ఆలకిస్తూ.

"మీరే మాట్లాడుతూ నన్ను ఉండమంటారేమిటి? ఇది మరీ బాగుంది! ఓహో!"

"అబ్బ! నీకు సరసానిక్కూడా వేళాపాళా లేదు - అదుగో ఎవరో తలుపు తట్టుతున్నారు."

"అవును! అందుకనే భోజనం ముందు కూర్చుని ప్రారంభించాను సరసం!"

"ప్రకాశం! ప్రకాశం!" గట్టిగా తలుపు చప్పుడు. "ఎవరింట్లో?"

"ఎవరో వచ్చారు. వెళ్ళు. తలుపు తీసి, అట్లా గదిలో కూర్చోబెట్టి, పేరేమిటో కనుక్కురా!"

"నేను వెళ్ళనమ్మా! నాకోసం వచ్చారని దెప్పుతారు తరువాత!"

ప్రకాశం సంతోషంతో ఇకిలిస్తూ "ఇప్పుడు నువు మాత్రం ఏం చేస్తున్నావేం. దెప్పక? నా పేరు పెట్టి పిలుస్తుంటే నీ కోసం వచ్చారనటానికి నాకు మతి లేదనుకున్నావా?... పో, పో! వెళ్ళి తలుపు తీసిరా!" అన్నాడు.

మాణిక్యం అయిన ఆలశ్యం యావత్తూ కమ్మేసేటందుకల్లే పరిగెత్తుకుంటూ వచ్చి గడియతీసి తలుపులు తెరిచి, చప్పున భయపడ్డదానల్లే ఒక్క అడుగు వెనక్కు వేసింది. ఆమె మొహం మీది చిరునవ్వు తుడిచి వేసినట్టు మాయం అయింది. తలుపు తియ్యటంతో తన పని పూర్తి అయినట్టు మాణిక్యం వెనక్కు తిరిగి నాలుగడుగులు వేసి వచ్చిన మనిషిని కనీసం కూర్చోనన్నా పెట్టాలని జ్ఞాపకం వచ్చి, "అట్లా గదిలో కూర్చోండి. భోం చేస్తున్నారు. వస్తారు!" అని ఎట్లాగో లోపల పడ్డది.

"ఎవరా వచ్చింది?" అన్నాడు ప్రకాశం మాణిక్యం వాలకం చూసి ఆశ్చర్యపోతూ.

మైళ్ళు పరుగెత్తి వచ్చిన దానల్లే శ్వాస ఆడకుండా మాణిక్యం "ఏమో, నేను అడగటం మరచిపోయినాను" అన్నది.

"దయ్యం చూసినదానల్లే అట్లా అయినావేమిటి?... ఎట్లా ఉన్నాడు?"

"ఏమో, పొడుగ్గా, సన్నగా ఉన్నట్టున్నాడు. నేను సరిగా చూడలేదు. నాకెందుకో ఆయన్ను చూడగానే భయం వేసింది!" అన్నది మాణిక్యం. తన భయం తలుచుకొని చిరునవ్వు నవ్వుతూ.

"కళ్ళజోడుందా?"

"ఏమో!"

"బట్ట కట్టుకున్నాడా?"

"ఏమో!"

"కోటు – "

"ఏమో! అబ్బ! నేను సరిగా చూడలేదండీ!"

"కళ్ళు మూసుకున్నావా ఏమిటి? లేక అంత తేరిపార చూడరాని విగ్రహమా?"

"అబ్బ! మెల్లిగా మాట్లాడండి! అవతల ఆయనకు వినపడుతుంది!"

"పిచ్చిమొద్దూ! వెళ్ళి పేరడిగిరా!"

"నేను పోను!"

అయిపోవస్తున్న భోజనం త్వరగా పూర్తిచేసి ప్రకాశం ఆదరాబాదరా చెయ్యికంచంలోనే కడుక్కుని అవతలికి వెళ్ళాడు. తరువాత కాస్సేపటికి మాణిక్యానికి ప్రకాశం "ఓరి గంగాధరం! నువ్వేనుట్రా! మా మణిని బాగా బెదరగొట్టావే?" అనటం వినిపించింది. ఆ గంగాధరం ఎవరో, ప్రకాశం కోసరం ఎందుకు వచ్చాడో గ్రహించటానికి వారి సంభాషణ విందామని మాణిక్యం ప్రయత్నం చేసింది. కాని లాభం లేకపోయింది. ఎంత మెల్లిగా మాట్లాడినా ప్రకాశం గొంతు వినిపిస్తున్నది కాని ఆ గంగాధరం గొంతు బొత్తిగా వినిపించనేలేదు. ఆయన అసలు మాట్లాడుతున్న అలికిడైనాలేదు. మాణిక్యం విసిగి భోజనానికి కూర్చున్నది.

"ఏమిట్రా, విశేషాలూ? ఏదో మహత్కార్యం భుజాన పెట్టుకుని వచ్చినవాడల్లే కనిపిస్తున్నావే!" అన్నాడు ప్రకాశం.

"ఏం మహత్కార్యంలే!... నీ భార్య తరఫున రాయబారిగా వచ్చాను. ఈ రాయబారానికి నిజంగా నేను తగినవాణ్ణి కాదు. ఎందుకంటే మీ యిద్దరికీ ఎందుకు చెడ్డదో నేనెరగను. తరువాత, కావటానికి నేను నీ భార్యకు పింతల్లి కొడుకును అయినప్పటికీ మనిద్దరమూ చిన్నప్పటినించే స్నేహితులం. మూడో విశేషం ఏమిటంటే నీ భార్య ఉత్త వెకిలిమనిషి అనీ, అది ఎటువంటి భర్తనూ సంతోషపెట్టగల తెలివి తేటలు లేనిదనీ

తెలుసు నాకు. నాకు నీమీదే పక్షపాతం. ఇదంతా మా సుందరంతో స్పష్టంగా చెప్పాను. అయినా అది నన్నే వెళ్ళమన్నది.

"ఇక అది నీతో అనమన్నదేమిటంటే – పొరపాటు తనదేననీ, అజ్ఞానంగా తను ప్రవర్తించిన మాట నిజమేననీ ఒప్పుకుంటే తనను మళ్ళా ఏలుతావేమో కనుక్కోమన్నది."

"ఒలికిపోయిన పాలు–"

"పొరపాటు తనదేనని గ్రహించిందని కాదు సుమా! అట్లా తను అంటే నువు దాన్ని చేపట్టుతావా అని. ఇందులో కాస్త తిరుగుడున్నది. నువు తన దగ్గిరికి తిరిగివచ్చే షరతుమీద అంటుందన్నమాట, తప్పుతనదేనని..... ఈ రాయబారం నేను సరిగా జరపటం లేదేమో! కాని అందుకు నేనేమీ పశ్చాత్తాప పడను. ఏమంటే మా సుందరి ధోరణి ఉందే నాకు చెడ్డ చిరాకు తెప్పించింది. నేను దానితో అన్నట్టే నీ విషయమై పక్షపాతం వహించి మాట్లాడుతున్నాను. నేను తిరిగివెళ్ళి దానితో చెబుతాను కూడానూ. సంధి పొసగకుండా రాయబారం చేశానని. నాకేం భయమా?"

ప్రకాశం నవ్వాడు.

"దాందుంప తెగిరిలే! ఆ విషయం పోనీ; ఎక్కడైనా విరిగిన మనస్సు అతకటం ఉందా? నేనూ మణీ చాలా సుఖంగా కాలక్షేపం చేస్తున్నాం. మణి ఇంటర్మీడియేట్ వరకూ చదువుకుందని నేను నా వుత్తరంలో రాశాను కాదూ? ఈ జన్మకు నాకదే భార్యా, నేనే దానికి భర్తనూ! ఇప్పుడు తిరిగి నా భార్య దగ్గిరికి వెళ్ళినా దాంతో ఏం మాట్లాడాలో కూడా తెలీదు, ఒట్టూ!"

గంగాధరం తను వచ్చినపని అయిపోయినట్టు దిక్కులు చూడటం మొదలుపెట్టాడు. ఇంతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్టు, "అన్నట్టు మీ నాన్న మాత్రం చాలా ఖేదిస్తున్నాడురా! ఆయనకెన్నో రకాల బోధించాను. కాని వేళ్ళతో కూడా పాతుకుని పోయిన అభిప్రాయాలు ఇట్టే పీకివెయ్యాలంటే సాధ్యమౌతుందా? చివరకు నా విషయం కూడా చెప్పాను. మనస్సు కలవని భార్యతో కాపరం చెయ్యటం ఏమిటో నాకు తెలుసునన్నాను. నేను వస్తుతహా కఠిన హృదయుణ్ణి కాకపోయినప్పటికీ నా భార్య చచ్చిపోవటం నాకు చాలా తెరిపి అయినట్టయిందనీ, మళ్ళీ పెళ్ళి అనే మాట తలపెట్టటానికైనా నాకు దమ్ములేకుండా పోయి నేను పూర్తిగా స్త్రీవిముఖుణ్ణి కూడా అయినాననీ అన్నాను... లోకం తొంభై అనుకుంటుంది. వాటిని మనం లక్ష్యపెట్టి మన సుఖం పాడుచేసుకోవటం కంటె పొరపాటు లేదు. నువు నిజంగా సుఖపడుతున్నానంటున్నావు కనక ..." అన్నాడు.

"సుఖం ఏమిటి? నాకు రవ్వంతయినా చీకూ చింతా లేదనుకో, స్వర్గంలో ఉన్నట్టుంది."

"కనక నీ పద్ధతులేమీ మార్చుకోకు – ఇంకొకరికోసం. నిజం ఆలోచిస్తే మనకోసం మారేవారెవరూ లేరు ఈ ప్రపంచంలో. నీ సొంతభార్యే ఏం చేసిందీ చెపుదూ? నీకోసం చిన్నమెత్తయినా మారిందీ?"

"ఎబ్బే!"

"అంతే మరీ!"

గంగాధరాన్ని చూస్తే ప్రకాశానికి మొదటినించీ ప్రేమే. కాని ప్రకాశం ఆ క్షణంలో గంగాధరాన్ని ఎన్నడూ ప్రేమించలేనంత ప్రేమించాడు. మరొకడైతే తప్పక తన పినతల్లి కుమార్తెవైపే పలుకును. ఇవతలవాడు ఎంత బాల్య స్నేహితుడైనా సరే! గంగాధరం నిజంగా చాలా యోగ్యుడు. నిజం గ్రహించగలవాడున్నూ!

"ఇక నేను వెళ్ళి వస్తానురా, ప్రకాశం. నా పని అయిపోయింది. నీ భార్యతో ఏం చెప్పమన్నావు?"

"నా జన్మకు కాస్త సుఖపడటమనేది నేర్చుకునేటప్పటికి దానికి అడ్డం తగులుదామని చూస్తున్నావా?' అని అన్నానని చెప్పు!... నువ్వు వెళ్ళుదువుగాని లేరా! ఒక రోజుండి పోరాదూ?"

"కాదురా! వెళ్ళాలి. ధాన్యమూ అదీ అమ్మించలేదు. కాస్త పొలమూ పుట్రా చూసుకోవాలి. రైతులను కూడా మార్చాలి. ఇప్పుడు చేస్తున్నవాళ్ళు మరీ పేచీకోరులుగా ఉన్నారు. మా నాన్నేమో తన చేతిమీదుగా కొన్న పొలం తన చేతి మీదుగానే అమ్మలేక చూస్తూ చూస్తూ, అప్పు బోలెడంత పెరగనిచ్చాడు. రెండెకరాలు బేరం కూడా పెట్టి రావాలి. మా నాన్న పోగానే చెయ్యవలసింది. పడలేదు. ఈ యేడైనా... నీ యోగక్షేమం రాస్తూ ఉండు. బండికి వేళ అవుతున్నది. వస్తానురా, ప్రకాశం!" అని గంగాధరం లేచాడు.

"సరే, మంచిది!... నిన్ను చూడటం నాకెంతో సంతోషంగా ఉందిరా, ప్రాణం లేచి వచ్చిందన్నమాట!"

మాణిక్యం భోంచేసి వచ్చేటప్పటికి గంగాధరం వెళ్ళిపోయినాడు. ఆమెకేమాత్రమో ఆశాభంగమయింది!

ప్రకాశం పెట్టిన రెండు నెలల సెలవూ అయిపోవస్తున్నది. మాణిక్యాన్ని తన వూరు ఎట్లాగా తీసుకుపోవటం, ఏం చెయ్యటమా అని అతను మధనపడుతూండగానే శుభవార్త వచ్చింది. తన ఉద్యోగం ఊడిందనీ, తన స్థానే పనిచేస్తున్న అతన్ని ఆ ఖాళీలో ఖాయపరిచారనీ.

ఆ మాట వినగానే మాణిక్యం దిగులుపడ్డది.

"ఆ ఉద్యోగం నాకు మా పినమామగారిప్పించాడు. తీసివేయించటం కూడా ఆయన

కట్టుకున్న పుణ్యమే అయి వుంటుంది. పోనీలే, పీడ విరగడ అయిపోయింది. మా నాన్న నడిగి డబ్బు తెప్పించుకుంటాను" అన్నాడు ప్రకాశం.

అతను తండ్రికి రాసిన ఉత్తరానికి మూడోనాడే సమాధానం వచ్చింది.

"నువు చేసిన పనికి తల ఎత్తుకుని తిరగలేక చస్తున్నాను. నిన్నూ నీ బోగం దాన్నీ డబ్బు కూడా ఇచ్చి పోషించమంటావా? ఇంకా పెళ్ళి కావలసిన చెల్లెళ్ళు ఇద్దరున్నారు నీకు, నేను నీకు ఎంత డబ్బు పంపగలననుకున్నావు? వాళ్ళిద్దరి పెళ్ళిళ్ళు కూడా వదిలేసి నీ భాగం ఎంత వస్తుందో అంతా నువు పంచుకోవటానికి నాకు ఎటువంటి అభ్యంతరమున్నూ లేదు" అని తండ్రి సమాధానం రాశాడు.

"ఆ ముసలి ప్రాణాన్ని ఎందుకు కష్టపెడతారు? మా అమ్మ దాచిపెట్టి నాకిచ్చిన డబ్బు ఎనభై రూపాయిలింకా నా దగ్గిరే ఉన్నై. అవి ఖర్చుపెట్టుతూ ఉందాం. ఈ లోపల మీరు మళ్ళీ ఏదైనా ఉద్యోగం చూడండి" అన్నది మాణిక్యం.

ఆ డబ్బు నెలా పదిహేను రోజుల్లో అయిపోయింది. ప్రకాశానికి ఉద్యోగం దొరకలేదు. అసలు అతను ప్రయత్నమే చెయ్యలేదు.

"పిచ్చిదానా, చేసినా ఉద్యోగం దొరికేది కాదు. నా మాట నమ్ము. ఈ రోజుల్లో ఉద్యోగమంటే మాటలా?" అన్నాడతను.

మాణిక్యానికేమో కాస్త కష్టం వేసింది. ప్రకాశం అశ్రద్ధ ఆమెకు రుచించలేదు. కాని ఆ విషయమై మాణిక్యం చూసీ చూడనట్టు ఊరుకున్నది. పాపం ఆ ఎనభై రూపాయలూ సంవత్సరం నించీ ఎంతో భద్రంగా దాచిపెట్టింది. ప్రకాశం వాటిని గవ్వలల్లే మార్చి, అది మాణిక్యం ప్రాణప్రదంగా దాచుకున్న డబ్బని ఒక్క రవ్వయినా ఆలోచన లేకుండా, గోల్డుఫ్లేకు సిగరెట్లకిందా, జట్కా బళ్ళ కింద, సినిమాలకిందా ఖర్చు పెట్టేశాడు.

తన మనస్సు చివుక్కుమనటం ఎందుకో మాణిక్యం అర్థం చేసుకోలేకపోయింది. ప్రకాశం తమ యిద్దరికిందా దాదాపు రెండు వందలు ఖర్చు పెట్టాడు. తన ఎనభై రూపాయలు ఖర్చయితే ఏం? తన మనసులో ఏ కోశానో నీచత్వం ఉన్నదనుకుని మాణిక్యం సిగ్గుపడ్డది.

"ఒక్కపని చేస్తాను!" అన్నాడు ప్రకాశం. "గంగాధరానికి రాస్తాను. నేనేదైనా ఏర్పాటు చేసుకునేదాకా వాడు మనకు కావలసింది ఇస్తాడు."

ఆనాడే ప్రకాశం గంగాధరానికి ఒక కవరు రాసి పడేశాడు. అతని దగ్గర్నించి కూడా మూడోనాటికే సమాధానం వచ్చింది.

"రేపు సోమవారం నాడు నీ పేర నూరు రూపాయలిన్నూరు చేస్తున్నాను. నువు ఇబ్బందిలో ఉన్నావని తెలిసి నాకు చాలా కష్టంగా ఉంది. రోజులు మనవి కానప్పుడు

అంతా విరోధులవుతారు - భగవంతుడు కూడా. ఈ డబ్బు జాగ్రత్తగా వాడుకుంటే హీనంగా రెండు నెలల వరకూ సరిపోతుంది" అని రాశాడు గంగాధరం.

మర్నాడు వందరూపాయలు వచ్చినై. ప్రకాశం ఉత్సాహానికి మేరలేదు.

"పిల్లా! ముందు ఒక గోల్డుఫ్లేకు పెట్టె తెప్పించు!... అదుగో, ఆ బత్తాయి కాయలు, పిలు. రెండు డజన్లు పుచ్చుకుందాం!"

మాణిక్యానికి ప్రకాశం ప్రవర్తన వెగటుగా తోచింది. ఈసారి అతన్ని నిరసించడానికి తన నైచ్యంతో ఏమీ సంబంధంలేదు. ఆ డబ్బు తనదికాదు. ఇంకొకరి డబ్బు ఖర్చుపెట్టేటప్పుడు "ఈ డబ్బు మనదికాదే!" అని కొంచెం ఉండకూడదా? పాపం, ఆయన, ఆ గంగాధరం గారు దేవుడల్లే సమయానికి అడ్డుపడ్డాడు కనక సరిపోయింది! లేకపోతే ఏ పూట పస్తు పడుకోవలసి వచ్చేదో!

మూడుసార్లుగా మూడువందలు పంపాడు గంగాధరం.

ప్రకాశానికి ఉద్యోగం లభించలేదు -

దానంతటది అది!

గంగాధరానికి మళ్ళీ డబ్బు కోసరం రాయవలసి వస్తుందా ఏమిటి అని ప్రకాశం భయపడుతుండగా గంగాధరం దగ్గిర్నుంచి అందరి గుండెలూ నీరు చెయ్యజాలిన ఉత్తరం వచ్చింది.

"ప్రకాశం - నా అజాగ్రత్త నా కొంప నిలువునా తీసేసింది. అకస్మాత్తుగా పొలాల ధరలు పడిపోయినై! ఈ రోజున నా ఆస్తికీ అప్పుకూ సరిపోతుంది. ఏనాడు నాకీ ముప్ఫై అయిదు రూపాయల ఉద్యోగమూ ఊడిందో ఆనాడు నేను చిల్లి గవ్వకు మారను.

"పాపం, నా మీద ఇంతకాలమూ ఆధారపడి, వేరే దిక్కు లేకుండా ఉన్న మీరు ఏమవుతారు? - గంగాధరం"

ఆ ఉత్తరం చదివి మాణిక్యం దుఃఖం ఆపుకోలేక పోయింది. తన కోసరం కాదు, ప్రకాశం కోసరమూ కాదు. ఆ గంగాధరం కోసరం ఆమె హృదయం ద్రవించడం మొదలుపెట్టింది. ఆ సమయానికి ప్రకాశం ఇంట్లోలేడు కనక సరిపోయింది. పోతే తన దుఃఖం అతనికి అర్థమయ్యేది కాదు. ఆ అర్థంవిప్పి చెప్పటం ఆమెకు చాతనయ్యేది కాదు!

ఈ అమాయకుణ్ణి చూసి తాను ఎట్లా దడుచుకుంది! అతని మొహమైనా తను స్పష్టంగా చూడలేదు.

గంగాధరం రాసిన ఉత్తరం చూసి కూడా ప్రకాశం డబ్బు కోసరం - ఒక్క పాతిక కోసరం, కనీసం పదిహేను కోసరం - ఉత్తరం రాశాడు! అందులో ఒక బొంకు కూడా

బొంకాడు. తనకు ఉద్యోగం అయే లక్షణాలు కనిపిస్తున్నవని. ఆ ఉత్తరం మాణిక్యం బలవంతాన చదివింది. "ఇది నిజంగా పోస్టులో వేస్తారా?" అన్నది మాణిక్యం.

వారి జన్మలో మొదటిసారీ చివరిసారీ ఆ ఉత్తరం గురించి కాస్త తీవ్రంగానే ఆ యిద్దరూ పోట్లాడుకున్నారు. అతను దాన్ని పోస్టులో వెయ్యటానికి వెళ్ళగానే ప్రకాశం పేర ఒక ఉత్తరం వచ్చింది. దానిమీది నల్లమరకలు మాణిక్యానికి అర్థం కాలేదు.

పోస్టాఫీసు నుంచి తిరిగివచ్చి ప్రకాశం ఆ ఉత్తరం చించి చూసుకున్నాడు. కొంత చదివి అతను నిట్టూర్పు విడవటం మాణిక్యం గమనించింది. సాంతంగా చదివిన తరువాత అతని కళ్ళలో ఒక విధమైన వెలుతురూ తీర్మానమూ రావటం కూడా గమనించింది.

ఆ ఉత్తరం తెచ్చిన అశుభవార్త ఇదీ.

"మా అన్నయ్య నిన్న రాత్రి అకస్మాత్తుగా చనిపోయినాడు. చెట్టంత కొడుకు పోతే మా అమ్మా నాన్నా దుఃఖం పట్టలేకుండా ఉన్నారు. వాళ్ళు ఏడుస్తుంటే మేము చూడలేకుండా ఉన్నాము. ఉన్న ఒక కూతురూ ఇట్లా కావటం, ఒక కొడుకూ అట్లా కావటం. ఇంతకూ వాళ్ళ రోజులు మంచివి కావు. మీరు నన్ను క్షమించినా క్షమించకపోయినా నేను మీ విషయంలో ఎంత బుద్ధి లేకుండా ప్రవర్తించానో తెలుసుకున్నాను. నా విషయం అట్లా ఉండగా మా అమ్మా నాన్నలకు అల్లుడైనా కొడుకైనా ఇక మీరే కనక వాళ్ళయందైనా కరుణించి మీరు ఈ ఉత్తరం అందిన వెంటనే రావలసింది - సుందరి"

మొదట్లో ప్రకాశం తన తండ్రిని గురించిన విషవార్త ఏమైనా ఉత్తరంలో ఉందేమోనని గాభరాపడిపోయినాడు. ఆ సంశయం వెంటనే తీరిపోయింది. మిగతా ఉత్తరంలో తనకు శుభవార్తే. భార్య చిట్టచివరకు తన తప్పు ఒప్పుకోవలసిన తీరుగా ఒప్పుకున్నది. తన బావమరిది పోవటాన్నుంచి తను పదిహేనెకరాల సుక్షేత్రమైన యీనాం మాగాణీ భూమికి హక్కుదారవుతాడు. ఇక తను ఉద్యోగం చూడవలసిన పీడ కూడా వుండదు.

కాకపోతే మాణిక్యం విషయం! తీరికగా మాణిక్యం విషయం ఏదో చెయ్యాలి. బహుశా మాణిక్యాన్ని తను వదులుకోవలసి వస్తుందేమో! మళ్ళా గౌరవనీయమైన సంఘంలో పడితే ఈ తగలాటం తనకు ఎట్లా వీలవుతుందీ? అయితే మంచిదే. కాకపోతే తను మాణిక్యాన్ని వదులుకోవలసి వస్తుంది?

కాకపోయినా మాణిక్యం తనమీద అధికారం చలాయించుదామని చూస్తున్నది అప్పుడే! ఏముంది? ఏ జాతి కాబుద్ధి!

"మా బావమరిది పోయినాడు. నేను అర్జంటుగా వెళ్ళాలి. నువు ఒక్కత్తెవూ ఉండలేవా? ఈ పది రోజులూ రావటానికి వీలుపడదేమో!"

"పాపం! వెళ్ళిరండి!" అన్నది మాణిక్యం. అతని మీద తనకు అంతకు పూర్వమే కలిగిన కోపం యావత్తూ మరిచిపోయి.

ప్రకాశం వెళ్ళి ఇరవై రోజులు కావస్తున్నది. అతని దగ్గిరనించి ఉత్తరం లేదు. అతను అసలే లేడు.

తన్ను ప్రకాశం వంచించాడనుకోలేకపోయింది మాణిక్యం. ఒక చెంప తన అంతరాత్మ నొక్కి చెప్పుతున్నా. ఆ ఆలోచన హృదయంలో పదే పదే తట్టుతుంటే, "నేనింత నీచురాలనయిపోతున్నానేమిటి?" అనుకున్నది.

ఆమెకప్పుడే ప్రకాశం వెళ్ళి ఒక యుగం అయినట్టున్నది. ఇంటిముందుగా ఏ బండి వెళ్ళినా, గడపముందు ఏమాత్రం అలికిడి అయినా ఆమె చెవులు రిక్కించి వినేది. వీధిలో ఎవరు ఎవరి వాకిలి తట్టినా ప్రకాశం వచ్చి తన వాకిలి తట్టినట్టే అయేది. ఆమెకు తిండిమీద కూడా ధ్యాసలేకుండా పోయింది. ఒక పూట వండుకుంటే ఒక పూట వండుకోక అశ్రద్ధగా ఉండటం మొదలుపెట్టింది.

ఒకసారి నిజంగా తలుపు తట్టారు. ఎంతో ఆదుర్దాతో వెళ్ళి తలుపు తీసింది. ఇంటాయన అద్దె అడగటానికి వచ్చాడు. తాత్కాలికంగా వచ్చిన త్రాణకాస్తా నశించిపోయింది. ఆమె అప్పటికి భోంచేసి అరవై గడియలైంది - అది కూడా ఏం వేసుకుని తిన్నదో!

"వారు ఊళ్ళోలేరు. రాగానే ఇస్తారు!" అని చెప్పి ఇంటాయన్ను పంపేసి మాణిక్యం వంట చేసేటందుక్కూడా సత్తువ లేక మంచం మీద ఒరిగింది.

సహం వళ్ళు తెలిసీ సహం తెలియకుండా ఆ మంచంమీద అట్లా పడుకుని "ఇదంతా నాకు అతడి మీద ప్రేమే?" అని ప్రశ్నించుకుని తనలో తను నవ్వుకుంది. తరవాత ఆమెకు స్పృహ తప్పింది.

ఎవరో తన మంచం దగ్గిర నిలబడ్డారు.... లోపలికి ఎట్లా వచ్చారో!.. కళ్ళు తెరిచి చూసేటందుక్కూడా ఓపిక లేదు. మళ్ళీ మైకం వచ్చేసింది.

అకస్మాత్తుగా తన శరీరంలో జీవం ప్రవేశించినట్టయింది. కళ్ళు తెరిచి చూడగలిగింది. ఆ గంగాధరం! అతని చేతుల్లో మంచినీళ్ళ గ్లాసుంది. ఆమె అప్రయత్నంగా నోరు తెరిచింది. అతను మరికాసిని నీళ్ళు ఆమె నోట్లో పోశాడు. ఎండిపోయిన ఆమె గొంతు కా నీళ్ళు అమృతం మాదిరిగా తగిలినై.

"బయట వాకిలి దగ్గిరిగా వేసి ఉంది. నువ్విట్లా ఒళ్ళు తెలియకుండా పడి ఉన్నావు. ఏదో ప్రమాదం జరిగిందనుకున్నాను."

"ఇట్లా ఉంటుందా ఈయన గొంతు!" అనుకుంది మాణిక్యం అసందర్భంగా.

"వంట ఇంట్లో ఎక్కడివక్కడ పారేసి ఉన్నై..... నువు వంట చేసుకుని ఎన్ని రోజులైందీ?"

"ఏమో, జ్ఞాపకం లేదు!"

"తిండి లేక శోషించింది.... ఎందుకట్లా చేశావు?"

"పొగరు! బద్ధకం!" ఆ రెంటికీ చాలా దగ్గిర బాంధవ్యమల్లే!

"నేను ఆ వంటిల్లు కాస్త బాగుచేసి వంట చేస్తాను."

"మీరా?"

"అవును. నేనే వంటచేసుకొంటాను. నాకు చేసిపెట్టే వాళ్ళెవరూ లేరు. హోటలు తిండి నాకు సరిపడదు."

ఆమె మళ్ళీ కళ్ళుమూసుకున్నది. చక్కని నిద్ర పట్టింది.

అతను మళ్ళీ వచ్చేటప్పటికి ఆమె గాఢనిద్రలో ఉంది. ఆమెను ఎట్లా లేపాలో అతనికి తెలియలేదు. "ఇదుగో!" అని చూశాడు కాని లాభం లేకపోయింది. పైగా చచ్చిపోయిన తన భార్య జ్ఞాపకం వచ్చింది. ఇక పేరుపెట్టి పిలవక తప్పింది కాదు.

"మాణిక్యం?"

పిలుపు ఆనలేదు.

కొంచెం గట్టిగా "మాణిక్యం!"

మాణిక్యం కళ్ళు తెరిచి బలహీనంగా నవ్వి "అంత పొడుగున నన్నెవరూ పిలవరు! మణి అనండి చాలు!" అన్నది.

"ఇదుగో! ఇవి తిను ముందు. తిని కాసిని నీళ్ళు తాగు. ఒక్కసారిగా భోంచేస్తే విషమిస్తుందేమో!"

"ఏమిటివి?"

"ఏదో తీపి సరుకు. హోటలునుంచి తెచ్చాను."

"ఎందుకు పడుతున్నారండీ ఈ అవస్థ అంతానూ!"

"ఎట్లా మరీ?"

మాణిక్యాన్ని గంగాధరం మంచంలో లేపి కూర్చోబెట్టవలసి వచ్చింది. అతను తెచ్చిన పదార్థాలు తిని కాసిని మంచినీళ్ళు తాగి మాణిక్యం "ఇక నేనేమీ తినలేను. నాకు వంట చెయ్యకండి" అన్నది.

"వంట అయిపోయింది. సయించినంత తిను, నీ యిష్టం వచ్చినప్పుడే కానీ!" అన్నాడు గంగాధరం.

"చీకటి పడ్డట్టుంది. కొంచెం లాంతరు వెలిగించండి." అతను లాంతరు వెలిగించాడు.

"మీరు భోంచెయ్యండి."

"అప్పుడే తొందరలేదు. నీకుకూడా ఆకలికానీ!"

"అమ్మా! నా కిక తిండివద్దు. నేను తోడుగా కూర్చుంటాను. మీరు భోంచెయ్యండి."

"నేను భోంచేస్తానులే నువ్వు తోడక్కర్లేదు. అప్పుడే నువ్వు లేచి నిలబడగలవా?"

"ఓ!" అంటూ మాణిక్యం లేచి నిలబడబోయి తూలి సమయానికి అతను అందించిన చెయ్యి పట్టుకుంది. "సత్తువ మెల్లిగా వస్తున్నది" అన్నది నిబ్బరంగా నడవాలని ప్రయత్నం చేస్తూ.

"అట్లా కాస్సేపు కుర్చీలో కూర్చో. నేను భోంచేసి వస్తాను పోనీ!" అంటూ అతను ఆమెను ఒక ఈజీ ఛైరులో కూర్చోబెట్టి తను ఒంటరిగా భోజనం చెయ్యబోయినాడు. కాని ఆమె అతని భోజనం పూర్తికాక పూర్వమే వంట ఇంట్లోకి వచ్చింది.

"పోనీ నేను కూడా కాస్త రుచి చూస్తాను మీ వంట" అన్నది మాణిక్యం.

కాని ఆమెకు తిండి లోపలికి పోలేదు. ఇద్దరూ ఒక్కసారే భోజనం పూర్తి చేశారు.

"అవన్నీ అట్లా ఉంచండి. రేపు నేను బాగు చేస్తాను!" అని ఆమె అతన్ని నిర్బంధించింది.

ఇద్దరూ ఇవతలికి వచ్చి చెరొక కుర్చీలోనూ కూర్చున్నారు. పడక కుర్చీలో తను కూర్చోనని మాణిక్యం మొండితనం చేసింది. అతనే దానిలో కూర్చున్నాడు.

ఇద్దరూ అయిదు నిమిషాలు అట్లా మౌనంగా కూర్చున్నారు.

"నేను వచ్చి నాలుగైదు గంటలయినట్టుంది. నేను మోసుకొచ్చిన వార్త ఇంకా బయటపెట్టలేదు. నువ్వూ అడగలేదు. ప్రకాశం సంగతి" అన్నాడు గంగాధరం.

"శుభవార్త అయితే మీ రప్పుడే చెప్పేవారు. కాదేమోననే అడగకుండా ఊరుకున్నాను. ఎప్పుడైనా వినవలిసిందే! చెప్పండి" అన్నది మాణిక్యం.

"ఈ ప్రకాశం నా కర్థం కావటంలేదు" అన్నాడు గంగాధరం తనలో తను మాట్లాడుకుంటున్నవాడల్లే. "నేను వాణ్ణి బాగా ఎరుగుదుననుకున్నాను.... ఎవరో అన్నట్టు మనం ఎంత బాగా ఎరిగిన మనిషి అయినా ఆడదాని దగ్గిరికి వచ్చేటప్పటికి ఎట్లా ప్రవర్తించుతాడో చెప్పలేమన్నది నిజమేనేమో!... వాడికీ భార్యకూ చెడ్డది. తన తప్పేనని ఆ భార్య కూడా ఒప్పుకున్నది. తీరా విచారిస్తే ఏమీలేదూ! వట్టి చిన్నతనపు తగూ. తండ్రి నడిగి వెయ్యిరూపాయలు తనకిప్పించమన్నాడుట ప్రకాశం తన భార్యను. అదివరకు కట్నం రూపంగా తీసుకున్నది చాలదా అన్నదిట భార్య. ఆ భార్యను వదిలిపెట్టేశాడు! ఇప్పుడు మళ్ళీ నీ విషయంలో... అయితే మీ యిద్దరికీ మనస్సులు కలవలేదన్నాడు. నిజమేనా?"

ఈ మాటలన్నీ తలవంచుకుని వింటున్నది మాణిక్యం. తలయెత్తి "నాకు

తెలిసినంతవరకు ఒక విషయంలోనే అట్లా జరిగింది. దేవుడివంటి ఒక స్నేహితుడితో ఆయనకు అబద్ధం ఆడటానికి అభ్యంతరం లేకపోయింది. నా మనస్సుకది కష్టంగా తోచింది! అంతే మా యిద్దరికీ కలిగిన అభిప్రాయభేదం!"

"చూశావా?" అన్నాడు గంగాధరం. నేననుకున్నంతా అయిందన్నట్టు. "తనూ భార్యా మళ్ళీ కలిసిన సంగతి నీతో చెప్పమనీ, నీకు డబ్బు ఏర్పాటు ఏదో చేస్తానని చెప్పమనీ, ఈ లోపుగా ఎట్లాగైనా నాలుగు రోజులు ఓర్చుకోమని చెప్పమనీ నన్ను పంపించాడు. నీకు అర్జంటుగా కావాలంటే నన్నే ఏదైనా ఇవ్వమన్నాడు. నా దగ్గిర ఇరవై రూపాయలు మాత్రం ఉన్నై!"

"ఇంకా మా మొహాన ఎంత డబ్బు పెడతారండీ! ఇప్పటికే మీ సొమ్ము మూడు వందలు తినివున్నాం. నా మెడలోవీ, చేతులవీ నగలు రేపు అమ్మించేస్తాను. మీ మూడు వందలూ మీరు తీసుకోండి. ఆ తరవాత నన్నెవరూ పోషించనక్కరలేదు. కథలో నక్క మాదిరిగా అందని పళ్ళకు అర్రులు చాచాను కాని నేను బోగందాన్ని కానా? నాకు నా వృత్తి లేదా? రెండుసార్లు మోసపోయినాను. ఇంకొకసారి మోసపోతానా?"

మాణిక్యం పట్టలేక ఏడవటం మొదలుపెట్టింది.

"ఆ డబ్బు నువ్వెందుకివ్వాలి? నేను ప్రకాశాన్ని చూసి యిచ్చానా, నిన్ను చూశా? పైగా నేను అది తిరిగి పుచ్చుకోవాలని ఇవ్వలేదు. నాకా గడవకపోదు. నెలకు ఇరవై చాలు. నా జీతంలో పదిహేను రూపాయలు హీనంగా మిగుల్చుకోగలను. అదీగాక అయిదురూపాయలు మా ఇంట్లో భాగానికి అద్దె కూడా వస్తుంది!"

మాణిక్యం ఏడుపుమాత్రం మానలేదు.

"నువ్వట్లా ఏడవకు, మాణిక్యం. నేను చూడలేను!"

మాణిక్యం తన దుఃఖాన్ని దిగమింగి కళ్ళు తుడుచుకుంటూ "నిస్సత్తువ చేత ఏడుపు కూడా స్వాధీనంలో రాకుండా ఉంది. లేకపోతే మీ చేత అడిగించుకోను ఏడుపు మానమని!" అన్నది.

బుద్ధి తక్కువై ఏడుపు మానమన్నాననుకున్నాడు గంగాధరం.

రెండు మూడు నిమిషాలు ఇద్దరికీ ఏమి మాట్లాడేటందుకు లేకపోయింది.

"అది కూడా కాదు!" అన్నాడు గంగాధరం. "నా కాశ్చర్యమేమిటంటే, అపేక్షలూ, అంతఃకరణలూ కర్మను అనుసరించి రావచ్చును, పోవచ్చును. అందుకు బుద్ధిమంతుడు సిగ్గుపడతాడా? తనకు నీ మీద అపేక్ష కలిగింది! సిగ్గుపడ్డాడా? నీతో కాపరం చెయ్యలేదూ! ఆ అపేక్ష పోయింది! నీతో ఆ మాట స్వయంగా అనరాదూ? ఉత్తరం రాయటానికిక్కూడా

మొహం చెల్లదుట! నన్ను తరిమాడు. నేనప్పుడు అన్నా 'నీ మనసులో ఏదో కల్మషం ఉంది. లేకపోతే ఆ మొహం చెల్లకపోవటమనేది కలగదు! అని" అన్నాడు గంగాధరం.

"ఒకరి సంగతి ఎందుకులెండి. ఇందులో నా బుద్ధి పొరపాటు బోలెడుంది. నా కులానికి తగిన వృత్తీ, ఆ వృత్తికి తగిన విద్యా మానేసి, తగుదునమ్మా అని నేను ఇంగ్లీషు చదువుకుపోయినాను. ఆ చదువులో పడ్డప్పటినించీ అందరి మాదిరిగా నేను కూడా ఇల్లాలిని కావాలని, ప్రేమ అనుభవించాలని! నాకు బాగా దొరికాడు మా మామయ్య. మా అమ్మ ఏదో ముల్లె పాతిపెట్టిందని ఆశ పడి అతను పెళ్లాడతానని అనీ అనీ, నన్ను తన దగ్గిర ఆరునెలలు అట్టే పెట్టుకుని, చివరకు మా అమ్మ పాతిపెట్టిన బండారం బయటపడగానే నా తోవ నన్ను చూసుకోమన్నాడు.

"మా మామయ్యా, ప్రకాశంగారూ పట్టణంలో కలిసి చదివారు కాలేజీ చదువు. అప్పుడీయనకూ నాకూ కొద్దిగా పరిచయం. నేను పట్టణం నించి వస్తుండగా మధ్య స్టేషనులో నా పెట్టెలోకే ప్రకాశంగారూ ఎక్కారు. నా కష్టాలన్నీ ఆయనతో మొరపెట్టుకున్నాను. ఆయన ముందూ వెనకా ఆలోచించకుండా 'మనిద్దరం పెళ్ళి చేసుకుందాం!' అన్నారు. నాకు ఆశ పుట్టింది. ఆశ పడ్డందుకు భగవంతుడు గట్టిగా చెంపలు వాయించాడు!"

మళ్ళీ అయిదు నిమిషాలపాటు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు.

"అయితే నీ ముందు గతేమిటి?"

"దాన్ని గురించి ఇప్పుడాలోచించ బుద్ధి పుట్టటం లేదు. జీవితంలో ఒక్కొక్క సమయం వస్తుంది – అట్లా జీవితం యావత్తూ జరిగితే మనకు అభ్యంతరం ఉండనవసరం లేని సమయం. ఇప్పుడటువంటి సమయం వచ్చింది. రేపు గురించి ఆలోచిస్తూ ఈ క్షణం ఎందుకు పాడుచేసుకోవాలీ? రేపు మీరు వెళ్ళిన తరవాత నా ముందు గతిని గురించి ఆలోచించటానికి బోలెడంత వ్యవధి ఉంది!"

"ప్రకాశం సంగతి చెప్పగానే మండిపోతావనుకున్నాను... నాకింకా అర్థం కాలేదు. నువ్వు వాడికోసమే గదా భోజనం కూడా మానేసి శోషించింది. వాడి సంగతి చెప్పగానే మొదలు నరికిన చెట్టల్లే ఎందుకు పడలేదో!"

"నేను అంత నిర్లక్ష్యం చేసింది ఆయన కోసం కాదు. ఆయన రారని వారం రోజుల కిందటే రూఢి చేసుకున్నాను. జీవితంలో నేను పెట్టుకున్న గురులు రెండూ ఈ జీవితానికి లేకుండా పోయినై – పెళ్ళీ, ప్రేమా! జీవితం మీదే విరక్తి పుట్టింది!"

"మళ్ళీ నేను వెళ్ళగానే ఈ విధంగానే భోజనం మానేసి పస్తు పడుకుంటావా ఏమిటీ?"

"ఏం పడుకుంటే?" అన్నది మాణిక్యం నవ్వుతూ.

"అట్లా చెయ్యనని వాగ్దానం చెయ్యకపోతే నేనిక్కణ్ణించి వెళ్ళనే వెళ్ళను!"

"మీరు వెళ్ళకపోతే నా కభ్యంతరమనా? మీతో గడిపిన ఈ కాస్సేపూ ఉన్నట్టు నా జీవితంలో నాకెన్నడూ లేదనుకుంటాను!"

గంగాధరం ఆ మాటకు ఏం చెప్పాలో ఆలోచించలేకపోయినాడు. కాస్సేపు మాణిక్యం వంక అట్లాగే చూస్తూ కూర్చుని అతను అకస్మాత్తుగా, "ప్రకాశం తన మనస్సులో భావాన్ని పైకి ప్రకటించటానికి సిగ్గుపడ్డందుకు ఇంతకు మునుపే తప్పుపట్టి నా మనస్సులో భావం నేనెందుకు దాచిపెట్టాలి?... మాణిక్యం, నాకు భార్యవవుతావా?" అతని గొంతు కొంచెం చలించింది. "నేను బీదవాణ్ణి. నలభై రూపాయల మీద ఇద్దరు మనుష్యులు బతకవచ్చుననుకో! అయినా కాలూ చెయ్యీ ఆడదు. నువు సుఖానికి అలవాటుపడిన ప్రాణం కావచ్చును!"

మాణిక్యం అతని మాటలు అర్థం చేసుకోనట్టు అతని వంక పెద్ద కళ్ళు చేసుకుని నిశ్చలంగా చూడటం మొదలుపెట్టింది.

"నేనా సుఖానికి అలవాటు పడిన ప్రాణిని!" అని అసందర్భంగా, "నేను మిమ్మల్ని ఆకర్షించాలని ఏమైనా ప్రయత్నం చేశానా - నాకు తెలియకుండా!" అన్నది మాణిక్యం.

గంగాధరం నవ్వాడు.

"నీకటువంటి భయం ఏమీ అక్కర్లేదు. నువ్వటువంటి ప్రయత్నం చేసినా నేను తెలుసుకోలేను. నేను రసికుణ్ణి కాను. నా భార్య ఎప్పుడూ ఆ మాటే అనేది!"

"మీరిప్పుడు నన్ను మీ భార్య కమ్మనేనా అడిగారు?" అన్నది మాణిక్యం దాదాపు కావాలని అడుగుతున్నట్టుగా.

అయితే ఆమె ఆశ్చర్యం అతనికి కృత్రిమంగా కనిపించలేదు. "అవును" అన్నాడతను.

"ఎందుకంటే. మొదట నేను వేశ్యను - మీరెరుగుదురు! తరువాత నేను ఇద్దరికి ఉంపుడుకత్తెనుగా ఉన్నాను. రెండుసార్లూ నా భార్యాత్వం జయప్రదం కాలేదు.... మళ్ళీ ఆరు నెల్లు!" అన్నది మాణిక్యం అక్కడక్కడా ఇంగ్లీషు మాటలు కూడా ఉపయోగించి మాట్లాడుతూ.

గంగాధరం కూర్చున్న చోటినుంచి లేచివచ్చి ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకొని "కాదు, మాణిక్యం! నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను. ఎట్లాగూ నేను నిన్నిట్లా విడిచి పెట్టి వెళ్ళలేను. నువ్వేమవుతున్నావో అని నా మనసు బాధిస్తూనే ఉంటుంది" అన్నాడు.

మాణిక్యం బలహీనంగా నవ్వి, "ఆ దౌర్బల్యం మీలో లేకపోలేదు. అందుకనే నాలుగు నెలలనుంచీ నన్నూ మీ స్నేహితుణ్ణీ కూడా పోషిస్తున్నారు. కడుపున కన్న

పిల్లలమల్లే! నా కోసం మీరు జాలిపడటం నాకు సంతోషమే కానివ్వండి, మీకు అందువల్ల చాలా ముప్పున్నది. నా వంటి వాళ్ళు ప్రపంచం మీద కట్టుకుపోయినంతమంది ఉన్నారు. వాళ్ళందరి కోసమూ మీరు!"– అని ఏదో అనబోతుండగా గంగాధరం కొంచెం వంగి ఆమె చెంప ముద్దుపెట్టుకున్నాడు.

"నాలో ఏం చూసి మీరు నన్ను ప్రేమిస్తున్నారో నా కర్థం కాలేదు" అన్నది మాణిక్యం.

"నాకూ అర్థం కాలేదు. కాని తెలుసుకోవాలని లేదు. అంతే మనిద్దరికీ భేదం. నా గుండె చూడు ఎట్లా కొట్టుకుంటున్నదో! అది అబద్ధం ఆడుతుందా?"

మాణిక్యం అనుమానిస్తూ అతని గుండె మీద చెయ్యి వేసి "అమ్మో" అన్నది.

"ఇంకేమిటి నీ అనుమానం?"

"నన్ను మామూలు బోగందాన్ని ఉంచుకున్నట్టే ఉంచుకోండి. ఎంతకాలం ప్రాప్తం ఉంటే అంతకాలం మీ దగ్గిర ఉంటాను. మీకు ఏ క్షణాన మొహంమొత్తితే ఆ క్షణాన...."

గంగాధరం మాణిక్యం మూతి అట్లాగే ముద్దు పెట్టుకున్నాడు అమిత గట్టిగా.

"నేను మోటువాణ్ణి. నాకు నాజూకులు తెలియవు. నా యిష్టం వచ్చినట్టు మాట్లాడకపోతే అట్లా శిక్షిస్తాను."

మాణిక్యం అతని మెడ చుట్టూ చేతులు వేసి "పది నిమిషాల కిందట ఎంత గౌరవంగా ఉన్నాం. ఇంతలో ఇట్లా కావటానికి కారణం ఎవరు? ఆ తప్పెవరిది?" అన్నది.

"నాదే!" అన్నాడు గంగాధరం గర్వంగా.

"సరేగాని ఈ పని ఆనాడు నేను మీకు తలుపు తెరిచినప్పుడే ఎందుకు చెయ్యకపోయినారు?"

"ఏ పనీ?"

"తలుపు తెరిచి మీరు కనిపించగానే ఎందుకో నాకు పుట్టెడు భయం వేసింది. అమాంతం నన్ను పట్టుకుని ముద్దు పెట్టుకుంటారనే! ఆ దడ ఎంత సేపటి దాకానో పోలేదు! ప్రకాశంగారు కనిపెట్టారు కూడాను!"

"ఛా!'

"ఒట్టండీ! నేను ఎప్పుడూ ఊహించుకుంటూ ఉండేదాన్ని. నన్నెవరో బలవంతంగా ముద్దు పెట్టుకున్నట్టూ నా కిష్టమై కూడా నేను పెనుగులాడినట్టూ! ఎందుకో చెప్పలేను. కాని మిమ్మల్ని చూడగానే నేను ఎప్పుడూ తలుచుకుంటూ ఉండిన మనిషి మీరే ననిపించింది. ఇన్ని రోజులు కూడా నేను రహస్యంగా మీ మనిషిని అయినట్టే! ఆ పెద్ద రహస్యం ఎవరికీ తెలియకుండా దాస్తున్నట్టు ఫీలవుతున్నాను... ఇప్పుడా రహస్యం మీకు తెలిసిపోయింది!"

గంగాధరం చప్పున గంభీరుడైపోయినాడు!

"ఇదంతా కలే! ఎప్పుడో కళ్ళు తెరిచేటప్పటికి నువ్వుండవు. కాని చాలా అందమైన కల!" అన్నాడతను.

" ఏ ప్రతిజ్ఞ అయినా మగవాళ్ళకు చెల్లిపోతుంది. మీరు మీ మనస్సులో ఉన్నది బయట పెట్టుతానని ప్రతిజ్ఞ చేసి నెగ్గించుకున్నారు. నేను మళ్ళీ ఇటువంటి పని చెయ్యననుకుని చెయ్యటానికి సంసిద్ధురాలను అవుతున్నాను. ఆడ జన్మలు వెధవ జన్మలు. అంతరాత్మ అనేది ఉన్న ఆడదానికి సుఖం లేదు. మాకు మధ్య మధ్య స్వేచ్ఛగా నవ్వుదామన్నంత ఉత్సాహం వస్తుంది. ఎందుకా నవ్వు అని అడుగుతుంది అంతరాత్మ. నా మనస్సు ప్రేమతో నిండి పొర్లిపోతున్నది అంటుంది నా బోటి ఆడది. ప్రేమతో నిండకేం చేస్తుందిలే. నీ కూడూ, నీ గుడ్డా సంపాదించి పెట్టేటందుకు ఎవరినో ఒకర్ని సంపాదించుకున్నాక! అంటుంది అంతరాత్మ!" అంటూ మాణిక్యం సన్నగా నిట్టూర్చింది.

గంగాధరం ఆమె వంక దీనంగా చూస్తూ "నువ్వట్లా అనుకుంటున్నావా?" అన్నాడు.

మాణిక్యం నవ్వి "నేనంటే నేను కాదు. మీరు ముద్దు పెట్టుకోగానే నా వొళ్ళు బంగారమయింది. మీరు ప్రేమించేటప్పటికి నేను దేవతనై పోయినాను!" అన్నది.

మొదటి ముద్రణ : కారుణ్యం కథల సంపుటి, ఫిబ్రవరి 1937
యువ కార్యాలయం, తెనాలి